క్లుప్తంగా

పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు



పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న డాక్టర్ సునీల్, పాల్గొన్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి గాంధీ గ్రామంలోని పశువైద్యశాలలో శనివారం ప్రపంచ రేబిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేశారు. పశువైద్యశాల డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు కుక్కల ద్వారా సంక్రమించే రేబిస్ వ్యాధి ప్రాణాంతకమైనదని, ఈ వ్యాధికి టీకా ఒక్కటే నివారణ మార్గమన్నారు. పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని సూచించారు. డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ టీకాలు ఉచితంగా ప్రతి ప్రభుత్వ పశువైద్యశాల్లో వేస్తున్నట్టు చెప్పారు. సుమారు 50 పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలోనాయకులు బాలకృష్ణ, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ బజార్ ప్రారంభం



మెప్మా అర్బన్ బజారును ప్రారంభించిన ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారులో శనివారం మెప్మా అర్బన్ బజారును ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెప్మా బజార్‌లో పలు రకాల నాణ్యమైన వస్తువులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ బజారును వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జోన్-8 కమిషనర్ హేమావతి, ఏపీడీ శ్రీరామ్, 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, రైతు బజార్ ఈవో నారాయణ రావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి



స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దీక్షలో పాల్గొన్న పెన్షనర్లు

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించాలని ఆల్ ఇండియా పెన్షనర్స్, రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ (ఆప్రా) జిల్లా అధ్యక్షుడు దీనబంధు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ పార్కులో అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన దీక్షలో ఆప్రా సభ్యులు శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1340 రోజులుగా విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యమం జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ చాప కింద నీరులా ప్లాంట్‌ను అమ్మేయడానికి ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 4070 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడానికి ప్రయత్నం చేసిందటే ప్లాంట్‌ని ప్రైవేట్ వాళ్లకి కట్టబెట్టడానికే నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం ప్రజా ఉద్యమాల్ని గౌరవించకపోవడం దురదృష్టకరమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ని సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌ని కాపాడతామని చెప్పిన చంద్రబాబు రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లను మూసేస్తే ఎందుకు తెరిపించలేకపోతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ని రక్షించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరించారు. దీక్షలో వి.ఉసీరామ్, కేఎం కుమార్ మంగళం, ఎం.త్రినాథ్, రాంప్రభు తదితరులు పాల్గొన్నారు.

బాబూ..వైకుంఠ వాసుడిపై రాజకీయాలా?



నాయకులతో కలిసి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

- చంద్రబాబు చేతిలో తోలుబొమ్మ పవన్
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- చంద్రబాబు, పవన్‌ల బుద్ధి మార్చాలని వెంకన్న ఆలయంలో పూజలు

మల్కాపురం: నీచ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా చంద్రబాబు నిలుస్తారని,అబద్ధాన్ని నిజమని ప్రచారం చేయడంలో.. నిజాన్ని అబద్ధమని నమ్మించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ సూచనతో 59వ వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో మాజీ సైనికుల కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పూజలు చేశారు. చంద్రబాబు,పవన్ కల్యాణ్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అమర్‌నాథ్ పాల్గొని 40,60, 61, 62 వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, డాక్టర్ పి.వి.సురేష్, కొణతాల సుధ,బల్లా లక్ష్మణరావులతో కలిసి వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అమర్‌నాథ్ మాట్లాడుతూ



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

తిరుమల లడ్డూ విషయంలో చంద్రబాబు రోజుకో అబద్ధం ఆడుతున్నారని మండిపడ్డారు. తొలుత లడ్డూలో కల్తీ నెయ్యి కలిసిందని, మరో సారి కల్తీ జరిగింది గానీ ఎందులో కలిసిందో తెలియదని చెప్పడం వెనుక ఆయన హిందువులను ఎంత తప్పుదోవ పట్టిస్తున్నారో అర్థమవుతోందనన్నారు.

సీబీఐ విచారణకు డిమాండ్ చేసే దమ్ముందా..!

తిరుమల లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి కలిపిన విషయం వాస్తవం అయితే ఎందుకు సీబీఐ, సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడం లేదని ప్రశ్నించారు. విజయవాడ వరద బాధితుల అవస్థలతో పాటు సూపర్ సిక్స్ వంటి హామీల అమలు కోసం ప్రజలు నిలదీస్తారనే భయంతో ఇలాంటి నీచ



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

మైన ఆరోపణలకు తెరతీశారని ధ్వజమెత్తారు. కూటమి నాటకాలు ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో వారికి బుద్ధి చెబుతారన్నారు. చంద్రబాబుకు ప్రజలను మోసం చేసి అధికారం చేజిక్కించుకోవడం అలవాటు అయిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పలు వార్డుల అధ్యక్షులు రేవళ్ల సత్యనారాయణ,పాడుగు రాజు తదితరులు పాల్గొన్నారు.

- 58వ వార్డు పిలకవానిపాలెం ఆంజనేయస్వామి ఆలయంలో చంద్రబాబు,పవన్‌ల బుద్ధి మార్చాలని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గులిగిందల కృష్ణ, వర్మ తదితరులు పాల్గొన్నారు.

బాబు, పవన్ తీరుతో తిరుమల ప్రతిష్టకు భంగం

కంచరపాలెం: తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్టను కూటమి ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తుందని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పేర్కొన్నారు. చంద్రబాబు, కూటమి నాయకులు చేసిన అనుచిత, అబద్ధపు వ్యాఖ్యలకు నిరసనగా ఆలయాల్లో ప్రక్షాళన కార్యక్రమం నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు డీకే ఫౌండేషన్ చైర్మన్ దొడ్డి కిరణ్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం సంపత్ వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు పంజాబ్ హోటల్ జంక్షన్‌లోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో 52,56,57,89, 90,91, 92 వార్డుల కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు , పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్రమైన తిరుపతి లడ్డూ ప్రసాదంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారికి వేంకటేశ్వర స్వామి తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో 57వ వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి, 56, 90 వార్డుల అధ్యక్షులు ఆడారి శ్రీను, చుక్కా ప్రసాద్‌రెడ్డి, 52,56,57 వార్డుల మండల పార్టీ అధ్యక్షుడు పల్లా ఎర్నికుమార్ యాదవ్, సీనియర్ నాయకులు దొడ్డి సతీష్, చంగల సూరిబాబు, శరగడం వెంకట లక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.



58వ వార్డు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు



గొల్లకంచరపాలెం సంపత్ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, వార్డు కార్పొరేటర్లు

విశాఖ చేరుకున్న స్వరూపానందేంద్ర సరస్వతి



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

గోపాలపట్నం: హరిద్వార్ రుషికేష్‌లో చాతుర్మాస దీక్ష పూర్తి చేసుకుని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి శనివారం విశాఖ చేరుకున్నారు. ఆయకు విశాఖ విమానాశ్రయంలో స్వాత్మానందేంద్ర సరస్వతి, పీఠం రుత్వికులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ లోక కల్యాణార్థం మూడు నెలల పాటు చేపట్టిన దీక్షలు విజయవంతం అయ్యాయన్నారు. దేవీ నవరాత్రుల్లో పాల్గొనేందుకు విశాఖ వచ్చినట్టు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడిరమణ అన్నారు. బుచ్చిరాజుపాలెం మెయిన్ రోడ్ విశాఖ డెయిరీ పార్లర్ నుంచి గాంధీ నగర్ రైల్వే గెడ్డ సీసీ రోడ్, డ్రైన్ల ఆధునీకీకరణ పనులకు ఏఈ వెంకట లక్ష్మితో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. రూ. 19.35 లక్షలు జీవీఎంసీ నిధులతో పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, యలమంచిలి ప్రసాద్, మాజీ కార్పొరేటర్ మల్ల అప్పారావు, నరవ పైడిరాజు, పైడిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఏ సేవలు ప్రైవేటుకు అప్పగించొద్దు

మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ ధర్నా



ఆర్టీఏ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ నాయకులు

గోపాలపట్నం: ఆర్టీఏ సేవలు ప్రైవేటుపరం చేయాలనే యోచనను విరమించుకోవాలని కోరుతూ మోటార్ వర్కర్స్ యూనియన్ సభ్యులు శనివారం ఆర్టీఏ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి అప్పారావు మాట్లాడుతూ రవాణా శాఖ కార్యాలయంలో ప్రజలకు అందించే సేవలు ప్రైవేటు పరం చేయడం చాలా దారుణమన్నారు. లైసెన్సు, ఫిట్‌నెస్ వంటి పలు రకాల సేవలు ప్రైవేటు సంస్థలు, వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. దీన్ని మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్, విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం వ్యతిరేకిస్తోందని తెలిపారు. ఏజెన్సీల పేరుతో బ్రోకర్లు అసలు ధర కంటే రెండు మూడు రెట్లు వసూలు చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రజలతో పాటు వాహనదారులకు పెనుభారంగా మారుతుందన్నారు. దోపిడీదారులను పెంచి పోషించే నిర్ణయాలను అంగీకరించబోమన్నారు. అనంతరం ఆర్టీఏ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

నిర్లక్ష్యపు నీడ

- కళ తప్పుతున్న ఎన్ఏడీ బ్రిడ్జ్ సెంటర్ సర్కిల్



బోర్డు పడిపోవడం వల్ల ఏర్పడిన గోతులు



వాటర్ ఫౌంటెన్ వద్ద నిలిచిన నీరు



వాకింగ్ ట్రాక్ ప్రాంతంలో ఏపుగా పెరిగిన మొక్కలు

గోపాలపట్నం: అధికారుల నిర్లక్ష్యంతో ఎన్ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ సెంటర్ సర్కిల్ వాటర్ ఫౌంటెన్ ప్రాంతం అధ్వానంగా మారింది. సరైన నిర్వహణ లేక కళావిహీనంగా మారుతోంది. ఇటీవల టీడీపీ నాయకులు ఫౌంటెన్ వద్ద భారీ గ్లో సైన్ బోర్డు ఏర్పాటు చేశారు. వర్షాలకు ఆ బోర్డు పడిపోవడంతో వెంటనే తొలగించిన అధికారులు, దానివలన ఏర్పడిన గోతులను మాత్రం పూడ్చకుండా వదిలేశారు. దీంతో అవి ప్రమాదకరంగా మారాయి. వృద్ధులు, చిన్నారులు ఆ గోతుల వద్ద గాయాలపాలవుతున్నారు.

ఎన్ఏడీ సెంటర్ సర్కిల్‌లో వాటర్ ఫౌంటెన్ వద్ద, చుట్టూ ఉన్న మొక్కలను క్రమపద్ధతిలో కట్ చేయకపోవడంతో ఫుట్‌పాత్ పైకి రావడంతో పాటు ఆ ప్రాంతం అస్తవ్యస్తంగా తయారైంది. వాటర్ ఫౌంటెన్ వద్ద నీరు నిల్వ ఉండడంతో దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి, ఆ ప్రాంతాన్ని బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఉక్కు పిడికిలి బిగిద్దాం



ప్రజా సంఘాల నాయకులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వి.వి.రమణమూర్తి

సీతంపేట: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్టోబరు 2న జరిగే భారీ ర్యాలీని విజయవంతం చెయ్యాలని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వి.వి. రమణమూర్తి పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర ప్రజా సంఘాల నాయకులతో కలిసి ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చెయ్యడానికి దూకుడు పెంచుతున్న సమయంలో ఉత్తరాంధ్ర ప్రజా సంఘాలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల ప్రజా సంఘాలన్నీ కలిసి మహా ఉద్యమంలా డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద తదుపరి కార్యక్రమం కోసం తీర్మానం చేసి లక్ష మందితో ర్యాలీ చెయ్యడానికి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇఫ్టు నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు ఎం.లక్ష్మి, వై.నూకరాజు, జె.రవి, కె.ఎస్.చలం, కె.పద్మ, సూర్యప్రకాష్, రవి, ఉప్పల లక్ష్మణరావు, పి.ఎస్.తిలక్, ఎస్ఎస్ శాస్త్రి పాల్గొన్నారు.


ఆర్ఐ, సర్వేయర్‌లకు ఘనంగా వీడ్కోలు



ఆర్ఐ సురేష్, సర్వేయర్ జగదీష్‌లను సత్కరిస్తున్న తహసీల్దార్ రమేష్, సిబ్బంది

గోపాలపట్నం: బదిలీపై వెళ్తున్న గోపాలపట్నం ఆర్ఐ సురేష్, సర్వేయర్ జగదీష్‌లను శనివారం తహసీల్దార్ సీహెచ్ రమేష్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాలపట్నం మండల పరిధిలో ఏపీఐఐసీ, ఎయిర్‌పోర్టు, పోర్టు ట్రస్ట్, రైల్వే, నేవల్ భూములను గుర్తించి సరిహద్దులు ఏర్పాటు చేయడంలో ఇరువురూ కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సువర్ణబాబు, వీఆర్‌వోలు సుబ్రహ్మణ్యం, నవీన్, సిబ్బంది రోహిత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

108 మంది పోలీసులకు రివార్డులు



సీపీ చేతుల మీదుగా రివార్డు అందుకుంటున్న వన్‌టౌన్ కానిస్టేబుల్ చిరంజీవి

మద్దిలపాలెం: నగర పోలీసు శాఖలో ఉత్తమ సేవలందించిన 108 మంది అధికారులు, సిబ్బందికి నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి రివార్డులు అందజేశారు. వృత్తిలో అంకితభావంతో పని చేసిన హోంగార్డు స్థాయి నుంచి సీఐ స్థాయి అధికారులకు రివార్డులను అందజేశారు. ప్రతి నెలా ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహకాలు అందజేస్తున్నామన్నారు.తమ ప్రతిభను గుర్తించి, ఉన్నతాధికారుల సమక్షంలో పోలీసు కమిషనర్ రివార్డులు అందజేయడంపై సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

కోలాటాన్ని కాపాడుకుందాం



సభలో పాల్గొన్న అతిథులతో కోలాట గురువు రాజేశ్వరి

మల్కాపురం: కోలాట ప్రదర్శన జరిగే చోట దేవతలు కొలువుదీరతారని చెబుతారని, అలాంటి పవిత్రమైన కళను అంతరించకుండా కాపాడుకుందామని ప్రముఖ కోలాట నాట్య గురువు ఆకుల లోవ రాజేశ్వరి అన్నారు. శ్రీ రాజరాజేశ్వరి కోలాట నాట్య కళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 58వ వార్డు గుల్లలపాలెం, కృష్ణుడి గుడి వద్ద శనివారం నిర్వహించిన కోలాట నాట్య కళ పరిచయ వేదికలో ఆమె మాట్లాడారు. కోలాటం అభ్యసించడం ఒక వరమని పేర్కొన్నారు. కార్యక్రమానికి అతిథులుగా హాజరైన జిల్లా అగ్నికుల సంఘం అధ్యక్షుడు మాతా వెంకటరమణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు కొప్పాడి బలరాముడు, వార్డు మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి తదితరులు మాట్లాడారు. యువత, మహిళ కోలాటంపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సుమారు 20కి పైగా కోలాట బృందాలు దేవుని సంకీర్తనలకు కోలాటం ప్రదర్శించి, ఆకట్టుకున్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ



బహుమతులు గెలుచుకున్న విద్యార్థులతో కళాశాల సిబ్బంది

గోపాలపట్నం: పర్యావరణాన్ని పరిరక్షించుకుంటేనే మానవాళి మనుగడ సాధ్యమని నరవ విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. ప్రదీప్ వర్మ అన్నారు. గ్రీన్ కన్జ్యూమర్స్ డే సందర్భంగా కళాశాల ఈసీఈ డిపార్ట్‌మెంట్, ధరిత్రి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, ఏపీ పొల్యూషన్ బోర్డు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాలుష్యాన్ని నివారించాలని, వ్యర్థాల పునర్వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు పీపీటీ, పోస్టర్ ప్రెజెంటేషన్, బెస్ట్ అవుటాఫ్ వేస్ట్ వంటి పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఈసీఈ హెడ్ డాక్టర్ జీవన్‌రావు, ధరిత్రి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యదర్శి ఎస్.నానాజీ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో జ్వర బాధితులను గుర్తించాలి

మహారాణిపేట : నరసింహనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శనివారం పరిశీలించారు. అక్కడ అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. పథకాల అమలులో ఎలాంటి బ్యాక్‌లాగ్స్ లేకుండా చూసుకోవాలని, అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్, తదితర వాటిపై సూచనలు చేశారు. అభ యాప్ శత శాతం డౌన్లోడ్ చేయించాలని, ఆధార్ నంబర్ లేకుంటే సంబంధిత ఆశ కార్యకర్తతో యాప్ అప్లోడ్ చేయించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి జ్వర బాధితులను సకాలంలో గుర్తించాలని ఆదేశించారు. యాంటీ లార్వా ఆపరేషన్‌పై స్థానికులకు అవగాహన కల్పించాలని సూచించారు. లీవ్ రిజిస్టర్, మూవ్‌మెంట్ రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. గర్భిణులకు ఐరన్ మాత్రలు అందజేయాలన్నారు. ఆయనతోపాటు జిల్లా మీడియా విస్తరణాధికారి (డిమో) బి.నాగేశ్వరరావు, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల హక్కులకు కేంద్రం తూట్లు

విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు అయోధ్యరామ్



దీక్షల్లో మాట్లాడుతున్న అయోధ్యరామ్

అగనంపూడి: ఉక్కు కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాల తీరు మారకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు అయోధ్యరామ్ హెచ్చరించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో శనివారం చేపట్టిన 1325వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. ఓపక్క కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును రక్షిస్తామని నమ్మబలికిస్తూనే మరోపక్క మానవ వనరులను పూర్తిగా తగ్గించే చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. స్వచ్ఛంద పదవీ విరమణ పథకం అమలు చేయడం, అనేక మందిని వివిధ ప్లాంట్‌లకు డిప్యుటేషన్‌పై పంపించడం , కాంట్రాక్ట్ కార్మికులను రాత్రికి రాత్రే తొలగించడం చూస్తుంటే ఉద్యోగులు, కార్మికులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తుందన్నారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ సెయిల్‌లో 54వేల మంది కార్మికులు ఉండగా 20 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేస్తున్నారని, అంటే ఒక మిలియన్ టన్నుకు 2750 మంది కార్మికులు పనిచేస్తున్నారని, అదే విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 12 వేల మంది 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. స్టీల్ సీఐటీయూ ప్రతినిధులు దీక్షా శిబిరంలో పాల్గొనగా నాయకులు ఎన్.రామారావు, పుల్లారావు, మరిడయ్య, వి.ప్రసాద్, పట్టా రమేష్, మొహిద్దీన్, బాలశౌరి, శ్రీనివాస్, రాజు తదితరులు మాట్లాడారు.

జాబ్ మేళాలో 43 మందికి ఉద్యోగాలు

మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో పాలిటెక్నిక్, స్కిల్ హబ్ సంయుక్తంగా రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాబ్ మేళా శనివారం ముగిసింది. పోకార్నా ఇంజినీరింగ్ స్టోన్ లిమిటెడ్, ఏసీన్ హెల్త్ కేర్ ఆర్‌సీఎం సర్వీసెస్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ సంస్థలు నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు 179 మంది హాజరవగా 35 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు చెప్పారు. మేధా సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలకు 102 మంది హాజరవగా 8 మంది ఎంపికైనట్లు తెలిపారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ ఎంఏవీ రామకృష్ణ మార్గదర్శకత్వంలో డీఎస్‌డీవో చాముండేశ్వరనాథ్, టీపీవో ఎం.హరిబాబు సహకారంతో ఈ ఇంటర్వ్యూలు విజయవంతంగా నిర్వహించామని ప్రిన్సిపాల్ చెప్పారు. ఈ మేరకు విద్యార్థులకు ఎంపిక పత్రాలు అందించారు.